క్లుప్తంగా

వైభవంగా వనుములమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో వనుములమ్మ

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో కొలువైన వనుములమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం రాత్రి గ్రామస్తులు, కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారితో పాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. జాతరలో రాత్రి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, బ్యాండు వాయిద్యాలు వంటివి ఏర్పాటు చేశారు. ఇవి చూపరులను ఆకట్టుకున్నాయి. జాతర అనంతరం సోమవారం ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో గ్రామస్తులతో పాటు పలు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా కుంతీదేవి జాతర


అమ్మవారి జాతరలో ఆకట్టుకున్న గారడీ నృత్యం

కె.గంగవరం: మండలంలోని పామర్రులోని కుంతీదేవి జాతరని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా కుంతీదేవి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన గారడీలతో ప్రత్యేక నృత్య ప్రదర్శన చేశారు. పామర్రుతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అమ్మవారిని దర్శించుకుని గారడీ నృత్యాలను ఆసక్తిగా తిలకరించారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

కపిలేశ్వరపురం: బ్రేకర్ల నిర్మాణ పనుల నేపథ్యంలో అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సోమవారం తెలిపారు. కపిలేశ్వరపురం, అంగర, టేకి, వెదురుమూడి, పడమర ఖండ్రిక, మాచరమట్లలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కాపుసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'మేడేపల్లి'



కపిలేశ్వరపురం: జై కాపుసేన అనుబంధ యువజన విభాగం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా అంగర గ్రామానికి చెందిన మేడేపల్లి కనకరామకృష్ణ నియమితులయ్యారు. ఆ మేరకు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బసవ చిన్నబాబు నుంచి ఉత్తర్వులు అందినట్టు సోమవారం కనకరామకృష్ణ తెలిపారు. కాపు సామాజిక వర్గంలోని యువత అభ్యున్నతికి కృషి చేస్తానని కనకరామకృష్ణ తెలిపారు.

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల పంపిణీ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం, కె.గంగవరం మండలాల్లోని దివ్యాంగ చిన్నారులకు ఆలింకో, సమగ్రశిక్ష సంస్థల ద్వారా ఉచితంగా వచ్చిన ఉపకరణాలను మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. రామచంద్రపురం మండలంలో 22 మందికి, కె.గంగవరం మండలంలో 20 మందికి మొత్తం 42 మందికి దివ్యాంగ చిన్నారులకు వీల్ చైర్లు, ఎలక్ట్రికల్ మోపెడ్‌లు, బ్రెయిలీ కిట్లు, వినికిడి యంత్రాలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వాడ్రేవు సాయిప్రసాద్, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఎంఈఓలు తాడి వీరరాఘవ రెడ్డి, ఎ.నాగరాజు, నాయకులు, పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి శేషారావు, టేకుమూడి సత్యనారాయణ, వ్యాఖ్యాత విఠల్ మాస్టారు పాల్గొన్నారు.

రాఘవరావు, భవానీలకు సత్కారం


ఏలూరులో సత్కారాన్ని అందుకున్న రాఘవరావు, భవాని

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన తెలుగు పండితుడు నక్కిన వీర రాఘవరావు, ఆయన సతీమణి గంపల భద్ర వెంకట గంగాభవానీలను శ్రీశ్రీ కళావేదిక సత్కరించింది. ఏలూరులో ఆదివారం నిర్వహించిన తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమంలో రాఘవరావు, భవానీలు వివిధ సామాజిక అంశాలపై కవితలను చదివి వినిపించారు. నిర్వాహకులు వారిరువురి సేవలను కొనియాడారు. తెలుగు ఉపాధ్యాయుడిగా పాఠ్యపుస్తక రచయితగా, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా రాఘవరావు వ్యవహరిస్తున్నారు.

అందమైన రాత.. భవితకు బాట

- సమాధాన పత్రంపై చేతి రాతకు ప్రాధాన్యం
- పేపర్ దిద్దే అధ్యాపకునికి అర్థమయ్యేలా అక్షరాలు ఉండాలి
- ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి పరీక్షలు
- కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు


పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఏడాది కష్టం విద్యార్థి సాధించిన మార్కుల రూపంలో కనిపిస్తుంది. మెరుగైన మార్కుల సాధనకు మస్తిష్కంలో పొందికైన విజ్ఞానమే కాకుండా చేతి రాత కూడా అవసరం. మెదడులోంచి పుట్టే ఆలోచనలు సమాధాన పత్రంపై పెట్టేటప్పుడు మన అక్షరాలు పేపర్ దిద్దే వారికి అర్థమవ్వాలి. ఒక వేళ చేతి రాత బాలేని కారణంగా పరీక్ష తప్పేందుకు, మార్కులు తగ్గేందుకు అవకాశాలూ ఉండొచ్చు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. మెరుగైన మార్కులు సాధించేందుకు చేతి రాత ప్రాధాన్యతను తెలిజేసేందుకు ఈ కథనం..

చేతి రాత ప్రాధాన్యమిదీ..

చేతి రాతను బట్టి మనిషి వ్యక్తిత్వం, గుణగణాలు చెప్పొచ్చంటారు. చేతిరాత మెదడులో సంక్లిష్ట అనుసంధానాల్ని ప్రేరేపిస్తుందనీ, జ్ఞాపక శక్తిని పెంచుతుందని చాలా అధ్యయనాలు తేల్చాయి. భావ వ్యక్తీకరణ, భాషా నైపుణ్యాలూ పెరుగుతాయి. ఆలోచనలను చేతిరాతలో పెట్టడం వల్ల సృజనాత్మకత పెరుగుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న చేతిరాత చదివేవారికి అర్థమయ్యేలా ఉండాలి. మరీ ముఖ్యంగా పరీక్షా పేపర్‌ను దిద్దే అధ్యాపకునికి సమాధాన పత్రంలోని చేతిరాత అర్థమయ్యేలా ఉండాలి. అలాగని ప్రతి అక్షరాన్ని శిల్పాల్లా తీర్చిదిద్దాల్సిన అవసరం లేదు.

ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ ఇదీ...

ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఫస్ట్ ఇయర్‌కి మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ సెకండ్ ఇయర్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

సబ్జెక్టు	ఫస్ట్, సెకండ్ ఇయర్
ఇంగ్లిష్	13-5-2025
మేథ్స్ ఎ,బోటనీ, సివిక్స్	14-5-2025
మేథ్స్ బి, జువాలజీ, హిస్టరీ	15-5-2025
ఫిజిక్స్, ఎకనామిక్స్	16-5-2025
కెమిస్ట్రీ,కామర్స్, సోషియాలజీ	17-3-2025

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇదీ...

తేదీ	పేపర్
19-5-2025	ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ) ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్)
20-5-2025	సెకండ్ లాంగ్వేజ్
21-5-2025	ఇంగ్లిష్
22-5-2025	మ్యాథమెటిక్స్
23-5-2025	ఫిజికల్ సైన్స్
24-5-2025	బయలాజికల్ సైన్స్
26-5-2025	సోషల్ స్టడీస్
27-5-2025	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2(కాంపోజిట్) ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1
28-5-2025	ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)

చేతి రాత ఇలా ఉంటే మేలు


సుందరమైన రాతకు సరైన చేతి భంగిమ

- పెన్ టిప్‌కు దూరంగా పట్టుకుని రాయడం ద్వారా అక్షరాలు రాసే విద్యార్థికి పూర్తిగా కనిపిస్తాయి.
- ఏ రకమైన పెన్ను వేగంగా రాయడానికి సాయంగా ఉంటుందో ముందుగానే కొంత ప్రాక్టీస్‌తో గుర్తించి పెన్నును ఎంపిక చేసుకోవాలి.
- చేతిలో పెన్నును తేలికగా పట్టుకునేలా అలవాటు చేసుకోవాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లకు మించి రాయకూడదు.
- ఇంగ్లిష్ అక్షరాలు మూడు మిల్లీ మీటర్లు, తెలుగు, హిందీ అక్షరాలు నాలుగు మిల్లీ మీటర్లు పొడవు ఉండేలా రాయడం ద్వారా రాత బావుంటుంది.
- అక్షరానికి అక్షరానికి, పదానికి పదానికి మధ్య తగిన ఖాళీ ఉండేలా జాగ్రత్తపడాలి.
- పెన్ను పట్టుకునే విధానం, కూర్చునే భంగిమ, సమాధాన పత్రాన్ని అమర్చుకునే తీరు రాతను ప్రభావితం చేస్తాయి.
- సున్నా, అర సున్నా, నిలువు గీతల రాయడంపై సాధన చేయాలి.
- రాసేటప్పుడు శీర్షికలు, ఉప శీర్షికలను అండర్ లైన్ చేయడం బావుంటుంది.
- సమయాన్ని దృష్టిలో పెట్టుకుని చేతిరాతకు ప్రాధాన్యతనివ్వాలి.
- చదివిన దాన్ని ఇంటి దగ్గర ఒకసారి రాసుకోవడంద్వారా పరీక్ష రాసినప్పుడు ఒత్తిడికి లోనుకాకుండా ఉండగలుగుతాం.
- చదివినదాన్ని ఇంటి దగ్గర ఒకసారి రాసి చూసుకోవడం ద్వారా పరీక్ష రాయడం సులభతరమవుతుంది.
- ఒక్కొక్క లైన్‌కు ఆరు నుంచి ఏడు పదాలు ఉండేలా చూసుకోవాలి. ఎక్కడైనా తప్పుగా రాస్తే ఆపదంపై పదే పదే రుద్దాల్సిన అవసరం లేదు. కేవలం కొట్టేయాలనుకున్న పదంపై ఒకటి లేదా రెండు గీతలను అడ్డంగా రాస్తే సరిపోతుంది. ఎక్కువ తప్పులు రాయకుండా జాగ్రత్త పడాలి.
- తెలిసినదంతా రాసేద్దామన్న ఆలోచన విద్యార్థి చేయకూడదు. ఎన్ని మార్కులు కేటాయించారో ఆమేరకు మాత్రమే సమాధానాన్ని రాస్తే సరిపోతుంది. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు, స్వల్ప సమాధాన ప్రశ్నలకు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలకు కేటాయించిన మార్కులు ఆధారంగానే సమాధానాన్ని రాయాలి. అందుకు తగిన సమయాన్ని ప్రణాళికాబద్ధంగా కేటాయించుకోవాలి.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు


దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో వైరాలజీ ల్యాబ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: రాష్ట్రంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ ప్లబిక్ హెల్త్ యూనిట్ (వైరాలజీ ల్యాబ్) నిర్మాణం పనులకు సోమవారం మంత్రి సుభాష్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 168 బ్లాక్ ప్లబిక్ హెల్త్ యూనిట్లను మంజూరు చేసిందన్నారు. గత కరోనా సమయంలో కొన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఈ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తే ఎటువంటి రక్త పరీక్షలైన 24 గంటల్లో రోగికి అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ, ఎంపీపీ మాత భారతి, జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి, సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, కొప్పుశెట్టి స్వామినాయుడు, డీఎంఅండ్‌హెచ్ఓ ఆర్ రమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.సుప్రియ, జి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో వైశాఖి పౌర్ణమి పూజలు


విజయదుర్గా అమ్మవారు


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో వైశాఖ పౌర్ణమి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుతగా విజయ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు అందుకున్నారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా చింతాలమ్మ అమ్మవారి తీర్థం


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

రాయవరం: పసలపూడిలో చింతాలమ్మ వారి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన అమ్మవారు గ్రామస్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ఏటా వైశాఖ పౌర్ణమి రోజున జాతర, ఆ మరుసటి రోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తీర్థంలో భాగంగా చింతాలమ్మ అమ్మవారికి భక్తులు ఉదయం నుంచి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని చినచింతాలమ్మ, పెదచింతాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు కూడా పూజలు చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు జాతర ప్రారంభమైంది. అమ్మవారి ప్రతిరూపాలుగా గరగలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గారడీలు, గరగనృత్యాలు, బ్యాండుమేళాలు, తీన్‌మార్, విచిత్ర వేషధారణలు జాతరకు వచ్చిన వారిని ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఇబ్బందుల్లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంపు

రాయవరం: పసలపూడి మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి సోమవారం విలేకరులకు తెలిపారు. సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో 6-15 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలకు సమ్మర్ క్లాసులు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ క్యాంపులో విజ్ఞానం, వినోదం, మానసిక వికాసం పెంపొందించేలా క్లాసులు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్స్, టీవీల నుంచి పిల్లల్ని దూరం చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు.

మహిళల రక్షణకు అంకిత భావంతో పనిచేయాలి

కొత్తపేట: వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాధిత మహిళలకు ఒకే గొడుగు కింద సహాయం అందించేందుకు ఉద్దేశించిన పథకమని ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడంలో నూతనంగా ఎంపికైన ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నందు నూతనంగా నియమించబడిన వన్ స్టాప్ సెంటర్ కాంట్రాక్టు ఉద్యోగులకు నియమాక ఉత్తర్వులు జేసీ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం మహిళా మరియు శిశు అభివృద్ధి కేంద్ర మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పనిచేస్తుందన్నారు. మహిళలకు అనేక రకాల సేవలను ఒకే చోట అందిస్తారని వైద్య సహాయం, బాధ్యత మహిళలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో సహాయం, మానసిక-సాంఘిక మద్దతు, కౌన్సెలింగ్ వంటి సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి సీడీపీవోలు, వన్ స్టాప్ కేంద్రం నూతన సిబ్బంది పాల్గొన్నారు.

రాధాకృష్ణకు పరామర్శ


రాధాకృష్ణకు ధైర్యం చెబుతున్న బోస్, తోట, అనురాధ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల మండపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజుబాబు) కుమారుడు గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నేతలు సోమవారం మండపేటలో రాజుబాబు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోసు, మాజీ ఎంపీ చింతా అనురాధ, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, విప్ పోతంశెట్టి ప్రసాద్ ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారిలో రాధాకృష్ణను కలసిన వారిలో జిన్నూరు సాయిబాబా, కొవ్వూరి త్రినాథరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, చిక్కాల శ్రీనివాస్, సాధనాల శివభగవాన్, వల్లూరు రామకృష్ణ, అధికారి శ్రీను, మెండు బాపిరాజు, తణుకు అశోక్, ఆలీఖాన్ బాబా, పెంకే గంగాధర్, పిఠాపురం సత్యనారాయణ, జొన్నపల్లి సత్తిబాబు ఉన్నారు.

నర్సింగ్ సేవలు సామాజిక అభ్యున్నతికి దోహదం


మండపేటలో నర్సులను అభినందిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు


రామచంద్రపురంలో నర్సులను సత్కరిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం (మండపేట): నర్సింగ్ సేవలు సామాజిక అభ్యున్నతికి దోహదపడతాయని నర్సుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కమ్యూనిటీ పారామెడిక్స్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) ఆధ్వర్యంలో నర్సులను సత్కరించారు. సీనియర్ నర్సు మాధురి సేవలను కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, ఆస్పత్రి సూపరిండెంట్ రాధా మాధురి మాట్లాడుతూ నేటి తరం నర్సులకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫ్లారెన్స్ నైటింగేల్ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె.సతీష్, నాగలక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, పీఎంపీ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్, మారిశెట్టి సత్యనారాయణ, మండిపూడి చంద్రశేఖర్, గాలింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరువలేనివి

రామచంద్రపురం: సమాజంలో నర్సుల సేవలు మరువలేనివని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి నర్సులను సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ ప్రాణ రక్షణలో విశేష సేవలందిస్తోన్న నర్సులను గౌరవించడం అందరి బాధ్యత అన్నారు. తొలుత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి

కపిలేశ్వరపురం: స్థానిక ఎంపీడీఓ కె.రత్నకుమారికి తూర్పుగోదావరి జిల్లా విజిలెన్స్ అధికారిగా నియమితులయ్యారు. ఆమేరకు ఆమె సోమవారం స్థానిక ఎంపీడీఓ బాధ్యతలు నుంచి రిలీవ్ అయ్యారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆమెను మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. పదోన్నతి పొందడంపై అభినందనలు తెలిపారు. ఇంతకాలం మండలంలో అభివృద్ధి పనులకు సహకరించిన ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, కార్యాలయాల సిబ్బందికి రత్నకుమారి కృతజ్ఞతలు తెలిపారు. సత్కార కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జి.రాజేంద్రప్రసాద్, ఈఓ పీఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా త్రిశూల స్నానం


సోమేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు


సోమేశ్వరస్వామికి చక్రస్నానం పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. తొలుతగా ఆలయంలోని స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందుగా స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భీమేశ్వరుని సన్నిధిలో సీఎంవో


భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న కార్తికేయ మిశ్రా

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి (సీఎంవో) కార్తికేయ మిశ్రా సోమవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈఓ దుర్గాభవాని ఆయనకు స్వామి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలు, ఉపాధ్యాయ ఖాళీలపై నేడు వర్క్‌షాపు

రాయవరం: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలు, పాఠశాలల్లో ఏర్పడే ఖాళీ పోస్టులపై వెరిఫికేషన్ చేసేందుకు అమలాపురం మండలం సమనసలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆయా మండల విద్యాశాఖ అధికారులకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. ఈ వర్క్‌షాపులో మండల విద్యాశాఖ అధికారులు, ఐటీ సిబ్బంది, జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు హాజరు కావాల్సి ఉంది. వర్క్‌షాపుకు హాజరయ్యే మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని పాఠశాలల్లో క్యాడర్ స్ట్రెంగ్త్, క్లియర్ వేకెన్సీలు, రీ అపోర్షన్ వేకెన్సీలు, 5/8 సంవత్సరాల ఖాళీలు, స్టడీ లీవ్స్, సర్‌ప్లస్ ఉపాధ్యాయుల వివరాలతో విధిగా హాజరు కావాల్సి ఉంటుందని డీఈవో తెలియజేశారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


మండపేటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మండపేట బురుగుంట చెరువు వద్ద సోమవారం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆరో రోజు నిరసన తెలిపారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం అధ్యక్షుడు పి.సుబ్బరాజు మాట్లాడుతూ 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకొన్న ప్రతి ఉద్యోగినీ రెగ్యులర్ చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో టేకి వెంకన్న, పిట్టా కప్పల సురేంద్ర, ప్రవీణ్, గంటి నవీన్ కుమార్, గంధం మధు, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న భాస్కర్ పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ

కపిలేశ్వరపురం: ఆంధ్ర ప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన వేగుళ్ళ లీలాకృష్ణ నియమితులయ్యారు. లీలాకృష్ణ ప్రస్తుతం జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.